కౌగిలి

జి. నాగేశ్వర్

"అరే సోం! మన ప్రోగ్రాం విషయం తేల్చి చెప్పండి. కొన్నాళ్ల పాటు హాయిగా గడుపుదామంటే ఒక్కడూ రాడేమిట్రా ?" వసంతరావు అన్నాడు.

"పిడో ప్రకృతి ఆరాధకుడిలా వున్నాడేమిట్రా?" సుబ్బారావు అన్నాడు.

"కథలేమన్నా వ్రాయాలా ?" అన్నాడు నవ్వుతూ సోమసుందరం.

వాళ్లంతా మైసూరు అడవులు చూడాలని నిర్ణయించుకున్నారు. కాని యింత వరకూ ప్రయాణం పడలేదు.

"అడవిని చూడటం నీ కిష్టంలేదా ఏమిట్రా ?" సుబ్బారావు అడిగాడు.

"నాకు చచ్చే యిష్టం. మా తాతగారి వద్ద యిప్పటికీ ఓ తుపాకి వుంది. ఆయన చిన్నతనంలో పులిని చంపాడట."

"నీ వన్నీ మీ తాతగారి లక్షణా లేరా ?" వ్యంగ్యంగా అన్నాడు సోమసుందరం.

"ముందు ప్రయాణ మెప్పుడో నిర్ణయించండిరా ?" విసుగ్గా అన్నాడు వసంతరావు.

"వెళదాంలేరా బాబూ ! పెళ్ళాం పిడ్డలు లేనివాడివి, చంద్రమండలమైనా సిద్ధమేనంటావు. మా అర్ధాంగులు మేమూ ఏస్తానుని పోరుపెట్టగలరు." సోమసుందరం అన్నాడు.

"మనకి నిజం చెప్పటం అలవాటు లేదు కదరా ! బెంగుళూరు ఆఫీసు పని మీద వెళుతున్నానని చెప్పేయ్ !" సుబ్బారావు సలహా యిచ్చాడు.

"నీ ఉచిత సలహాను పాటిస్తాను. నీ విషయం ఏమిటి?"

"నేనేనాడో రెడీ అయ్యాను. అడవిలో మంచి టేకు చూసి వ్యాపారం చేద్దామనుకుంటున్నాను."

"నాకు తెల్సురా. నీ వే పనిచేసినా పుణ్యం పురుషార్థం వుంటుంది." ఎత్తి పొడిచాడు.

ముగ్గురూ శుక్రవారం ప్రయాణానికి ముహూర్తం పెట్టారు. మైసూరు అడవులు మంచి టేకు, కలపకే కాక క్రూరమృగాలకు కూడా ప్రసిద్ధి.

వసంతరావు బళ్ళారిలోవున్న మేనమామకు టెలిగ్రాం యిచ్చాడు. మాలతికి పెద్ద ఉత్తరం వ్రాశాడు.

అనుకున్న ప్రకారం శుక్రవారం పెట్టే, బెడ్డింగులతో మిత్రత్రయం బయలుదేరారు. రామస్వామి ఆదరంగా వారిని యింట్లోకి ఆహ్వానించాడు. మాలతి వసంతరావుని చూసి పొంగిపోయింది.

ఆ రోజు రాత్రి అందరూ ముందు హాలులో పడుకోటానికి ఏర్పాటుచేసింది. ప్రయాణం చేయటంవల్ల సుబ్బారావు, సోమసుందరం వెంటనే నిద్రలోకి జారుకున్నారు.

వసంతరావు మాలతికోసం చాలా సేపు మేలుకొనివున్నాడు. మాలతికి కూడా అతనితో ఏకాంతంగా మాట్లాడాలనీ మనసులోని కోరికను వెళ్ళడించాలని వుంది.

ఆమె అతన్ని కలుసుకొనేటప్పటికి రాత్రి చాలా ప్రైం అయింది.

చల్లనిగాలి మత్తుగా వారి శరీరాలకు తగులుతుంది.

"బావా! మమ్మల్ని పూర్తిగా మర్చిపోయినట్లున్నావు?"

"నీవు మనస్సులో మెదిలినప్పుడల్లా నాకు మతిమరుపు ఎక్కువౌతుంది" అన్నాడు కొంటెగా.

ఆమె నవ్వింది.

"మాలా! రేపు మేము అడవిని చూడబోతున్నాము."

"అయితే తమరు వచ్చింది నాకోసం కాదన్నమాట."

"కాదని అంటే నీవు వూరుకుంటావా?"

"బావా! నీతో చాలా చెప్పాలి."

"యిప్పుడే చాలా చెప్పావు. యింకా ఏం మిగిలివుంది!"

"అదికాదు, మన విషయం."

"సరే చెప్పు. వింటాను."

"నన్ను పెళ్ళిచేసుకోవటం నీ కిష్టమేనా?" కుండ బద్దలు కొట్టినట్లు అడిగింది.

"లేదు" అన్నాడు ఆమె కోపం తెచ్చుకోవటం అతనికి చూడబుద్ధవుతుంది

"యిన్నాళ్ళూ ఆశలు పెంచటం

ఎందుకు ?" అని విసురుగా వెళ్ళి పోయింది.

అతను ఎంత పిలిచినా పలకలేదు.

మరునాడు వారు వచ్చిన పని రామస్వామికి చెప్పారుట. కలప వ్యాపారం చేయాలని తనకున్నదనీ అందుకు టేకు చూడటం అవసరమని సుబ్బారావు చెప్పాడు. టేకుచెట్లు అడవిలో పరుచుకొని వుంటాయి ఒకచోట పువ్వుపుట్టిందంటే అక్కడి చెట్లన్నిటికీ పువ్వు వుంటుంది. చూసుకోకుండా కొంటే వ్యాపారానికి నష్టం వస్తుంది.

"అడవిలోకి మీరు పోవటం చాలా ప్రమాదం. అడవికి దగ్గరలో ఓ పల్లెటూరు వుంది. అందులో నాకు తెలిసిన ఒకతను వున్నాడు. ఆయన మీకు తోడుగా మనుష్యులను పంపుతాడు. మీరు మాత్రం చాలా జాగ్రత్తగా వెళ్ళాలి. ఏ అనుమానం వచ్చినా వెనక్కు వచ్చేయండి," అని ఆయన వారికి తాను చెప్పవలసినది చెప్పాడు.

రామస్వామి స్నేహితుడు రాంసింగ్‌కు వేటలో మంచి ప్రావీణ్యం వుంది. అతని యింటిలో పులిచర్మాలు, ఏనుగు దంతాలు అలంకారాలుగా పెట్టారు. అతనికి ఆ పల్లెటూరిని వదల బుద్ధికాక అక్కడే వున్నాడు.

ముగ్గురూ రాంసింగ్‌ని ఆ మరురోజు కలుసుకున్నారు. ఆయన వారి వుత్సాహం చూసి చాలా సంతోషించాడు. ఆ రోజు వారికి ఆతిథ్యమిచ్చి మరునాడు అడవిలోకి పోవడానికి ఏర్పాటుచేశాడు. నమ్మకంగా తన వద్ద పనిచేసే కోయజాతివారిని వెంట పంపాడు. వారికి ఓ గన్, రెండు పిస్టళ్ళు యిచ్చి పంపాడు.

వారి వెంట వచ్చేయిద్దరిలో ఒకతన్ని నాయకుడంటారు వారిద్దరూ యీటెలతో వారికి ముందు ఒకరు వెనుక ఒకరు వున్నారు.

రకరకాల చెట్లు పక్షుల అరుపులు వాటి కూతలు వింటూ మైమరచి పోయారు. ఎగిరిపడే అలల్లా వుంది వారి మనస్సు. ప్రతి చెట్టు కాయను కోరికి చూసేవారు. అలా చాలా దూరం పోయారు సమయం పన్నెండుగంటలయింది. ఎండ తీవ్రంగా వున్నా చల్లగానే వుంది. అడవిలో జంతువులు గుంపులు గుంపులుగా వుంటాయి. దూరంగా లేళ్ళు పరుగెత్తుతుంటే ఆశ్చర్యంగా చూశారు ప్రతిచిన్నవిషయాన్నీ వింతగా చూడటంవల్ల వారు లోనకు పోలేకపోయారు. సాయంత్రం నాలుగు గంటలవరకూ తిరిగారు. అప్పటికే అలసిపోయ్యారు

తిరుగుముఖం పట్టేటప్పటికి చాలా దూరం తిరిగా మనిపించింది. సూర్యుడు కొండలలోకిపోయాడు ఎర్రని కిరణాలు ఆకాశాన్ని కప్పివేశాయి. పక్షుల రకరకాల అరుపులు ఎక్కువైనాయి.

చిన్నగా వెలుగు రేఖలు జారుతున్నాయి. చీకటితెర లోకాన్ని కప్పిలేస్తుంది

అడవిలో చెట్లు యిప్పుడు దయ్యాల్లా అగుపిస్తున్నాయి అందమైన పక్షులకు బదులు ఎన్నో రకాల కళ్ళు మెరుస్తున్నాయి. దూరంగా ఏవో జంతువుల అరుపులు, కీచురాళ్ళ శబ్దం తప్పితే వేరే ఏ శబ్దమూ లేదు. అందరూ మౌనంగా ముందుకు పోతున్నారు. నిరాన్మ్రష్యంగా వుంది. చీకటి భయాన్ని కలిగిస్తూంది.

అంతలో అలికిడయిన శబ్దం, వారి ముందు ఏదో కదలాడినట్లుంది. నాయకుడు ఒక్కసారిగా ఆగిపోయాడు. ముగ్గురూ భయంతో వణికిపోయారు. రెండడుగులు వెనక్కి వేశారు. వెనుక నున్న కోయవాడు యీటె పట్టుకొని ముందుకు వచ్చాడు.

రెండు పాములు బాట కడ్డంగా పెన వేసుకొని వున్నాయి.

టార్చి వేసి చూశారు.

సుమారు ఐదడుగుల పొడవున్నాయి. ఒకటి నల్లగా నిగనిగలాడుతూ మెరుస్తుంది.

వసంతరావు పిస్టల్‌ను వాటికి గురి పెట్టి వుంచాడు.

నాయకుడు వాటినేమీ చేయవద్దని సైగచేసి యీటెతో ఆకులు కదుల్చుతున్నాడు. కాని అవి అక్కడి నుండి కదల్లేదు.

ధన్ మని పిస్టల్ పేలింది. నల్ల త్రాచను రాసుకుంటూ గుండు దూసుకు పోయింది.

మరు క్షణంలో వూరూహించని విధంగా బుస్‌మని నల్లత్రాచు ఒక్కసారిగా పైకి లేచింది. అందరికీ హృదయ స్పందన ఆగింది. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని చైతన్యరహితులయ్యారు. సుబ్బారావుకి చేతులు వణకటం మూలాన చేతిలోని పిస్టల్ ఎక్కడ పడిందో అతనికే తెలియదు.

బుస్ మనే శబ్దం ఆగకుండా వస్తూంది.

ఎవరినో ఒకరిని కాటువేయక మానదనుకున్నారు.

"దొరా ! అది కొట్టటానికి చిక్కదు. ఏం చేయకండి ! అదే పోతాది." చిన్నగా గొణిగాడు కోయవాడు.

రెండు పాములలో ఒకటి బరబరా పొదలలోకి వెళ్ళింది. నల్లత్రాచు కొద్ది సేపు నిలబడి అదీ వెళ్ళిపోయింది.

ఆగిపోయిన గుండెలు కొట్టుకో సాగాయి.

"దొరా! బేగి పోదాం." నాయకుడు వడివడిగా నడిచాడు.

"ఎంతపని చేశావురా వసంతం" అన్నాడు సోమసుందరం.

"నీదో అర్థంలేని భయం. నీవు భయపడింది కాక మమ్మల్నీ భయపెడతావు. అదేం చేస్తుంది ?" అన్నాడు.

వారు రాంసింగ్ యింటికి జేరుకునే టప్పటికి రాత్రి చాలా టైం అయింది రాంసింగ్ వారికోసమే ఎదురుచూస్తు న్నట్లుగా వుంది స్నానానికి వేడినీళ్ళు పెట్టించాడు. స్నానం చేసేటప్పటికి పోయిన శక్తి వచ్చినట్లయింది. భోజనం ముగించారు

రాంసింగ్‌కు నల్లత్రాచుని కాల్చినట్లు, గుండు తప్పినట్లు చెప్పాడు వసంత రావు ఆయన పాము మంత్రగాడిని పిలిపించి మంత్రం వేయించాడు. సుబ్బారావుకు, సోమసుందరంకు అప్పటికి ప్రాణాలు కుదుటపడ్డాయి.

దినకరుని వేడికిరణాలు చురుక్కుమని తట్టిలేపేవరకూ వారికి మెలుకువ రాలేదు. రాంసింగ్ అప్పుడే వచ్చాడు.

''రాత్రి బాగా నిద్రపట్టిందా ?'' అడిగాడు

''నిద్రలో అన్నీ పాము కలలే.'' సుబ్బారావు అన్నాడు

''పోరా పిరికివెధవా.'' వసంతరావు అన్నాడు

''యీ రోజు వెళతారా?'' అడిగాడు రాంసింగ్.

''యీ రోజు వెళ్ళలేము. వొళ్ళు విరగొట్టినట్లు నొప్పులు.'' సోమసుందరం అన్నాడు.

''భయపడ్డావా ?''

''భయం కాదు నొప్పులు.''

ఆయన వారి భయానికి నవ్వు కున్నాడు.

రేపు మరలా వెళదామని అనుకు న్నారు.

మరుసటిరోజు వుదయాన్నే బయలు దేరారు. నాయకుడు ముందు నడుస్తున్నా యీసారి వారు దగ్గరగా ఆ ప్రాంత మంతా తెలుసునన్నట్లు ముందుకు పోతున్నారు.

''నాయకా ! మరోదారిగుండా వెళదామా ?'' అడిగాడు వసంతరావు.

''అట్టాగే దొరా !'' అంటూ ఓ సన్నని దారివెంబడ తీసుకెళ్ళాడు

చెట్లు యిరుగ్గా వున్నాయి. చిన్న చిన్న పాములు ఎన్నో కనిపించాయి. వాటిని చూస్తే యీసారి భయమనిపిం చటంలేదు ప్రక్కకు తొలిగిపోతు న్నారు. భీకరమైన అరుపులు వినిపిం చేటప్పటికి త్రుళ్ళిపడి ప్రక్కకు చూశారు. అడవిపందులు అరుస్తూ గుంపుగా వస్తున్నాయి క్షణాలముందు హాయిగా వున్న అడవి యిప్పుడు వికృ తంగా వుంది ప్రాణాలు పోయినట్లే భావించారు. వారివైపే వస్తున్నాయి. కోయవారు పెద్దగా అరిచి వెళ్ళగొట్ట టానికి ప్రయత్నిస్తున్నారు. సోమసుందరం తుపాకి గురిచూసి కాలుస్తున్నాడు. ఆ గుండ్లు తగిలాయో తగల్లేదో కాని అవి ప్రక్కకు వెళ్ళిపో సాగాయి హాయిగా వూపిరి పీల్చారు.

ఓ చోట కుందేళ్ళు, మరో చోట దుప్పులు దుముకుతూ తిరుగుతున్నాయి.

నెహ్రూ జూ పార్కులో అన్నిరకాల జంతువులను, పక్షులను, పాములను చూశారు. కానీ నిర్భయంగా అడవిలో తిరుగున్న వీటిని చూస్తుంటే వారి హృదయం పరవశ్శు తొక్కుతుంది. యివి జీవంతో కదలాడుతున్నట్లు, జూ పార్కులోవి నిర్జీవంగా వున్నట్లు వారి కనిపిస్తుంది.

అడవిలో ఎంతో దూరం వచ్చారు. వచ్చేకొద్దీ వుత్సాహం హెచ్చుతుంది. ప్రతిచెట్టు కాయనీతి నటం, అవి చేదుగా వుండటం పరిపాటి అయింది.

వారికి కొద్ది దూరంలో గలగల మంటూ నీళ్ళు పారుత్ను శబ్దం వినవస్తుంది.

అందరూ అక్కడికి వచ్చారు.

నిర్మలంగా నీళ్ళు వురవడితో పారు తున్నాయి. కాలువలో నీళ్ళు తక్కువగా వున్నాయి. అవి ఎండకు మిలమిల మెరుస్తున్నాయి.

నీళ్ళు చల్లగా వున్నాయి. ఎన్ని తాగినా ఇంకా తాగాలనిపిస్తుంది. దాహం తీర్చుకున్నారు.

"సోం ! యీసారి కాలువ ప్రక్కగా వెళదాం" అన్నాడు వసంతరావు.

"యిటుగా వెళదామా ?" అడిగాడు కోయవానివైపు చూసి.

"యిటు దారిలేదు దొరా !"

"యిటే వెళదాం," అన్నాడు వసంతరావు పట్టుదలగా.

నాయకుడు కాలువ ప్రక్కగా దారి తీశాడు. ఇటు పోవటం కొద్దిగా కష్టమని పిస్తుంది. పెద్ద పెద్ద ముళ్ళుకూడా వున్నాయి. దారికడ్డంగా లతలు పెన వేసుకొని వున్నాయి. వాటిని తొలగించు కోవటం కష్టమనిపిస్తుంది. చాలా దూరం కష్టమైనా అలాగే వెళ్ళారు

పోతున్న నాయకుడు టక్కున ఆగాడు పరీక్షగా ఒక చెట్టును చూస్తు న్నాడు. వెనకనున్నవారిని మాట్లాడ వద్దని సైగచేసి చెవులు రిక్కించి వినసాగాడు. దూరంనుంచి ఏవేవో అరుపులు వినిపిస్తున్నాయి. అందరికీ మళ్లీ భయం పట్టుకుంది. ఒక చెట్టు వద్దకు వెళ్ళి నిశితంగా చూశాడు.

"ఏమిటి నాయకా ?"

"యిది పేనూదమయిన దారి దొరా! మనకు దగ్గరలో పులులు వున్నాయి. ఇదిగో చూడండి. యీ చెట్టుకు పంజా చారలు ఎక్కడో పొంచివుంటాది. పులి దొంగది"

ముగ్గురూ చెట్టును చూశారు

"పులి పంజాకు పదును పెట్టుకో టానికి చెట్టును గట్టిగా కొట్టి రాస్తుంది. అట్టా అది గోళ్ళను పదును చేసుకుం టాది."

"మరేం చేద్దాం ?" సుబ్బారావు నీరసంగా అడిగాడు.

"యనక్కి పోవటంగూడా కష్టమే. యిటు పక్కగా ఎల్లిపోదాం" అని దక్షిణం వైపుకు మళ్ళాడు.

కోయవాళ్ళు యీటెలను గట్టిగా పట్టుకొని వున్నారు. సోమసుందరం గన్ని రెడీగా పెట్టుకొని ముందుకు వెళుతున్నాడు ఎవరికి వారే జాగ్రత్తగా బిక్కుబిక్కు మంటూ పరిసరాలను చూస్తున్నారు.

ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకున్నారు. ఏం జరగనున్నదో ? ఏ కొద్ది సవ్వడి అయినా పది కళ్ళు అటు తిరుగుతున్నాయి

నాయకుడు ఆగి ప్రక్కకు పరికించి చూస్తున్నాడు.

వారు ఓ చెట్టువద్ద కొచ్చారు. అలసట కలిగినట్లుంది. వసంతరావు చెట్టుపై చేయివేసి నాయకుడు ఏం చెబుతాడోనని వుత్కంటతో ఉన్నాడు.

చెట్టు మ్రాను పైభాగంనుంచి అతని చేతివైపు ఓ జీవి చిన్నగా కదలాడుతూ వస్తుంది. అతను దాన్ని గమనించనే లేదు. అది అతని చేతి దగ్గరగా వస్తుంది. అది అతని చేతిని పట్టుకోబోయింది. మరో క్షణంలో పట్టుకుంటుంది.

వెంటనే వెనుక వస్తున్న కోయవాని యీటె చేతిపైగా చెట్టుమ్రానుకు గుచ్చుకుంది. వసంతరావు ఏదో జరిగిందని ముందుకు పరుగెత్తాడు. కోయవాడు యీటెను బలంగా బయటికి లాగాడు. ఆ జీవికి గుచ్చుకున్న యీటె బయటికి వచ్చింది కాని ఆ విసురుకి అది ఎగిరి అతని కాలిపై పడింది. కాలి బొటన వ్రేలును గట్టిగా కరిచింది.

అది అచేతనంగా వాలిపోయింది.

ముందున్న నాయకుడు అప్పుడూ వెనక్కు చూశాడు.

కోయవాడు మెలికలు తిరుగుతూ పడిపోయాడు.

"నాయకా ఏమిటిది ?"

"అది వూసరవల్లి దొరా ! అది రంగులు మార్చుతుంది. అందుకే చెట్లలో అది కనపడదు. ఆకుల్లో వుండినప్పుడు పచ్చగా వుంటాది. కొమ్మపై వున్నప్పుడు కొమ్మరంగులో వుంటాది. అయిపోయింది దొరా! ఆడు సచ్చాడు."

బాధగా వాడివద్ద కూలబడ్డాడు.

ముగ్గురికీ హృదయాన్ని పిండినట్లయింది. తనకోసం చనిపోయాడని విచారించాడు వసంతరావు.

వూసరవల్లి చావబోయేటప్పుడు రంగులు మార్చుతూ చస్తుంది అలాగే కోయవాడు క్షణాని కోరంగు మారుతూ చివరకు పచ్చ, నలుపు కలిపినరంగు కొచ్చాడు. ఆ రంగు వచ్చిందంటే ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసి ళ్లేగద్దు.

"నాయకా ! మా వలన వో నిండు ప్రాణం పోయింది."

శవాన్ని వో గుంటలోకి లాగి బయలుదేరారు.

వసంతరావు చాలా బాధపడ్డాడు. యిలా జరుగుతుందనకుంటే అసలు వచ్చేవారేకాదు.

అప్పటికే సంధ్యాకాంతులు ఆక్రమించుకుంటున్నాయి. వెనక్కు తిరిగారు. నల్లని చీకటి వెలుగును హరించి రాజ్యం చేస్తుంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. ప్రమాదం ఎలా వస్తుందో వూహాతీతం. చెట్లలో మెరిసే కళ్ళు, భయంకరమైన అరుపులు వారిని త్వరగా ముందుకు నడిపిస్తున్నాయి.

వెన్నెల కాసాగింది. వెన్నెల వారికి కొంతంత ధైర్యాన్ని కలిగిస్తుంది. జీవితంలో మరువలేని అనుభవం. కాలం గడిచేకొలది వెన్నెల వెండిలా కురువసాగింది ఎక్కడ ఏ శబ్దం అయినా సోమసుందరం గుండును ఖర్చు చేస్తున్నాడు.

ప్రమాద మొచ్చినప్పుడు చెప్పలేని భయం కలుగుతుంది. మరలా ఎక్కడ లేని ధైర్యం వస్తుంది. అదో విచిత్రానుభూతి.

ఎన్నో పాములు దారి కడ్డంగా వచ్చేవి. కొన్నిటిని చంపేవారు. కొన్ని పొదల్లోకి పోయేవి.

వారు కాలువ వద్దకు వచ్చారు. హాయిగా శ్వాస పీల్చారు. నీరు తాగిన వెంటనే కోయవాడు వెళదామని అన్నాడు.

అంతలో గలగల మనే శబ్దం వినిపించింది. ఎండుటాకులపై నడుస్తున్న ధ్వని. అందరి గుండెలు కొట్టుకోసాగాయి. చుట్టూ చూశారు. ఎక్కడా జీవి ఉన్నట్టు కనిపించలేదు

నాయకుడు జాగ్రత్తగా శబ్దాన్ని వింటున్నాడు. వారిని వో బండచాటుకు రమ్మని సైగచేశాడు. అతని సైగ ప్రకారం అలికిడి కాకుండా బండవద్దకు వచ్చారు. ఆ బండచుట్టూ టార్చి వేసి ఏమీలేదని నిర్ణయించుకొని దాన్ని చాటుచేసుకొని కూర్చొన్నాడు.

శబ్దం ఎక్కువైంది. భయంతో చుట్టూ చూస్తున్నారు. నాయకుడు యీటెను సిద్ధం చేస్తున్నాడు సోమసుందరం గన్ గురి పెడుతున్నాడు

వుత్కంఠతో, అప్రమత్తంగా ఉన్నారు వారు. ఒక్కసారిగా ఆశ్చర్యంగా నోరు తెరిచారు కలో, నిజమో తెలుసుకోలేని స్థితిలో వున్నారు. ఆ శబ్దం చేసింది ఏ జంతువూ కాదు ఓ యువతి. ఆమె కాలువ నీటిలోకి దిగుతుంది ఆమె వంటిపై లంగా తప్ప మరే వలువలూ లేవు యౌవనం పరవళ్ళు తొక్కుతుంది. ఎత్తైన అవయవాలు నగ్నంగా వుండటాన దివ్యసుందరిలా అగుపిస్తుంది

వసంతరావు దృష్టి ఆమెమీదే వుంది. ఈ మహారణ్యంలో వంటరిగా, నిర్భీతితో స్త్రీరాకటం అతనికి ఆశ్చర్యం కలిగించిన విషయం నాయకుడు వెళదామన్నట్లు చేయివూపాడు. కానీ అతనికి ఆమె ఎచటికి పోతుందో చూడాలని వుంది. అతని మాటలు పట్టించుకోక ఆమె అవయవ పొంకం చూస్తున్నాడు. నాయకుడు

ఒక్క క్షణం వుండకుండా ముందుకు వెళ్ళాడు. సోమసుందరం, సుబ్బారావు అతన్ని అనుసరించారు. అతనికీ వారి వెనుక పోక తప్పలేదు.

తెల్లవారింది. రాంసింగ్ వారిని అడివికి పొమ్మనలేదు. సుబ్బారావుకు, సోమసుందరంకు విసుగు పుట్టింది. ఒక్కో క్షణం భయంతో తిరగాలి. ఏ క్షణంలో ఎవరికి ప్రాణాపాయం కలుగుతుందో చెప్పటం కష్టం. కోయవాని చావు మరువలేని దుర్ఘటన.

"మరోమారు వెళదాం రా," అన్నాడు వసంతరావు.

"ఈసారి నీవొక్కడివే పో..." అన్నారు.

"యిదే ఆఖరిసారి. మనం నాయకునితో పాటు మరో యిద్దరిని తీసుకెళదాం. యీ ఒక్కసారికి వొప్పుకోండిరా! యిక యీ ప్రాంతాలకు ఎప్పుడు వస్తామో, ఏమో!" బ్రతిమిలాడుతూ అడిగాడు.

"మేం నడవలేం." కచ్చితంగా అన్నారు.

వారిని ఎంత బ్రతిమిలాడినా ప్రయోజనం శూన్యం అనుకున్నాడు అతనికి వెన్నెలలో ఆ స్త్రీని మరోమారు చూడాలనిపిస్తుంది ఆమె ప్రతిరోజూ అక్కడకు వస్తుందనిపిస్తుంది.

మధ్యాహ్నం టిఫిన్‌చేసి కాఫీ తాగారు. సోమసుందరం, సుబ్బారావు కబుర్లలో పడిపోయారు. వసంతరావుకు వారితో మాట్లాడాలనిపించలేదు.

"అరే సోం ! అలా బయటికి వెళ్ళొస్తా," అన్నాడు.

యీ పల్లెటూరిలో ఏముందిరా చూడటానికి."

"టైం పాస్ అవుతుందికదాని."

"త్వరగా వచ్చేయ్ ! మాకు బోర్ కొడుతుంది" అన్నారు.

మంచి అవకాశ మనుకున్నాడు. తానొక్కడే వెళతానంటే వారు అంగీక రించరు. అతనికి ఎక్కడలేని గుండె నిబ్బరం కలిగింది. ఏదో ఆవేశం లాక్కెళుతుంది. నిర్భయంగా అడవి లోకి వెళుతున్నాడు. ఎందుకైనా మంచి దని పిస్టల్ జాగ్రత్తగా పట్టుకున్నాడు.

సంధ్యా సమయంలో అలా వెళ్ళటం హాయిగా వుంది. వారితో కలిసి వెళ్ళే టప్పుడు పక్కలనుండి ఏ జంతువన్నా వస్తుందని భయం కలిగేది. యిప్పుడా భయం లేదు. చీకట్లు అలుముకుంటు న్నాయి. పిచ్చివాడిలా నడుస్తున్నాడు.

ఓ చెట్టుపై గుడ్లగూబ రెక్కలు టప టపా కొడుతుంది. ఒక్కక్షణం తనస్థితి మర్చిపోయాడు.

ముందుకెళ్ళేకొలది ధైర్యం వస్తుంది. వెన్నెల కిరణాలు పర్చుకొంటున్నాయి. వెలుగు భయాన్ని పారద్రోలుతుంది. కాలువ వద్దకు వచ్చాడు.

చెప్పలేని పారవశ్యం కలుగుతుంది. నీళ్ళను తాగి నీళ్ళలోకి చూస్తూ కొద్దిసేపు గడిపాడు. ఈరోజు రాదేమో? తన ప్రయత్నం వృధా అవుతుందేమో ? కాని వెంటనే ఆ ఆలోచనకు స్వస్తి చెప్పాడు. తప్పక వస్తుంది అని సరిపెట్టుకున్నాడు

వెన్నెల ప్రభావం అడవిలో ఎక్కు వేమో ? విరగబడి కాస్తుంది. నీళ్ళలో కాలు పెట్టాడు. చల్లగా తగిలాయి. ఆ నీళ్ళు వెచ్చదనాన్ని కలిగిస్తున్నాయి. ఆకులు గలగలమని వినిపిస్తున్నాయి. కదలికల శబ్దం వస్తూంది. హృదయం ఆనందంతో పొంగుతూంది అవి దగ్గర అయేకొద్దీ ఉత్సాహంగా ఉంది

ఆమె వచ్చింది.

శరీరంపై లంగా, పొడవైన నల్లని కురులు వీపుపై పరుచుకొని వున్నాయి. నీటిలోకి దిగింది.

అతను ఆమెవద్దకు వెళుతున్నాడు. నీళ్ళలోకి దిగాడు. అంతవరకూ అతన్ని చూడనేలేదు. ఏమిటాని చూసింది. నవ్వుతూ దగ్గిరకు వస్తున్నాడు.

"ఎవరు నీవు ?" అడిగాడు.

భయంగా, విస్మయంగా చూస్తూ బయటికి వచ్చింది.

"నేనూ నీలాంటి మనిషినే. ఎందుకు భయపడతావు?" నవ్వుతూ అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. క్రూర జంతువును చూసినట్లు చూస్తూంది.



"ఏం ? మాటలు రావా ?"

అప్పటికే బయటికి వచ్చింది. పరుగెత్తాలని సంకల్పం.

"ఎందుకు భయపడతావు ?" నెమ్మదిగా అడుగులువేస్తూ అన్నాడు.

వడిగా ముందుకు వెళ్ళబోయింది.

ఎక్కడలేని శక్తితో ఆమెను చేరుకున్నాడు. ఆమె చేతిని పట్టుకున్నాడు. ఆమె శ్వాస అతనికి వినిపిస్తుంది. నగ్నంగా ఉన్న వక్షం ఎగిరిపడుతుంది.

"నీ అందం నన్ను ముగ్ధుణ్ణి చేస్తోంది. హాయిగా యిక్కడ గడుపుదాం" అన్నాడు.

"నేను పోవాలన్నట్లు ఆమెచేతిని విసురుగా లాక్కోబోయింది.

ఆది గమనించి గట్టిగా పట్టుకున్నాడు. నరాలు బిగుసుకుపోటాన చేయి ఇనప ముక్కలా గట్టిపడసాగింది. అతని శక్తి చాలటంలేదు. వెనక్కు మడిచి ముందుకు లాగింది. అతను వెనక్కు పడబోయాడు. పట్టుతప్పటాన తప్పించుకొని పారిపోబోయింది ఎంతో దూరం పోలేకపోయింది. చెట్ల లతలు పెనవేసుకోటాన ఆమెను వెంటనే చేరుకున్నాడు. ఈసారి రెండుచేతులు నడుంమీద వేసి గట్టిగా పట్టుకున్నాడు. ఏంచేయలేక చేతులతో అతన్ని వెనక్కు నెట్టింది. అతను కసిగా పట్టుకున్నాడు. ఆమె ప్రయత్నాలు వృధా అయాయి.

ఆమెని ఎత్తుకొని తీసుకొచ్చాడు. వక్షం వుబికి ఎగిరిపడుతూంది. పిచ్చివాడిలా అవయవాలవైపు చూస్తున్నాడు.

"నేనేం అడవి జంతువును కాదు. నీలాంటి మనిషినే" అన్నాడు రొప్పుతూ.

అతనిలో కోరిక సెలయేరులా పరవళ్ళుతొక్కుతూంది. కళ్ళు కామంతో నిండిపోయాయి. అతని చూపులు ఆమెని చీల్చివేస్తున్నాయి. ఆమె మెడ చుట్టూ చేతులువేసి గట్టిగా అదుముకున్నాడు. అతని పెదవులు ముఖాన్ని

ముద్దులతో నింపివేస్తున్నాయి. చేతులు మెడమీద నుండి క్రిందకు జారాయి. ఆమెను నలిపివేస్తున్నాడు. శరీరం వేడెక్కింది

ఆమె అతన్ని వారింపలేదు. ఆమె చేతులు అతన్ని చుట్టాయి. గట్టిగా కౌగిలించుకుంది. ఆ కౌగిలికి కీళ్ళు పటపట లాడాయి. ఆ తమకంలో ఆ కౌగిలే ఎంతో హాయిగా వుంది.

అతను ఆగలేకపోయాడు

ఆమె అతనిపైకి వంగింది. ఆమె శ్వాస పాము బుసలాగుంది నోరు తెరిచి గట్టిగా ముద్దుపెట్టుకుంది. అతని పెదవులను నోటితో మూసివేసింది. గట్టిగా అతని పెదవులను కొరికింది. పెదవులు చిట్లి రక్తం కారసాగింది. బాధతో మెలికలు తిరిగిపోసాగాడు. అతనికి మాట్లాడాలనీ, గట్టిగా అరవాలనీ వుంది. మాట్లాడలేక పోతున్నాడు. అతని పెదవులను నోటితో పట్టుకుంది. ఆమెనుండి దూరంగా పోవాలనిపిస్తుంది. గట్టిగా నెట్టాలనుకున్నాడు. కాని అలసి పోతున్నాడు వగుడాకులా క్రిందకు జారుతున్నాడు.

ఆమె "కీ......" అని అరిచింది. వికృతంగా వినిపించింది అతను భయంతో వణికిపోతున్నాడు. తల తిరుగుతున్నట్లుగా వుంది ఏమీ తెలియటం లేదు క్రిందపడ్డాడు – పాము కాటుకు గురైన అభాగ్యునిలా.

* * *

వసంతరావు జాడ తెలియకపోయే టప్పటికి సుబ్బారావు, సోమసుందరం భయపడ్డారు. రాంసింగ్ నిప్పుల పై అడుగుపెట్టినట్లు తిరిగాడు. అన్ని చోట్లా వెతికి చూశాడు.

"వీడు అడవిలోకే వెళ్ళివుంటాడు." అనుమానాన్ని వ్యక్తపరిచాడు సోమసుందరం.

రాంసింగ్ వెంటనే నాయకుని పిలిపించాడు. నలుగురూ అడవిలోకి వెళ్ళారు కాలువ వద్దకు వచ్చారు.

నలుగురికీ భయం, బాధా కలుగు తున్నాయి.

పడివున్న వసంతరావుని చూశారు. నిర్జీవంగా వున్నాడు. పెదాలవద్ద రక్తం నల్లగా గడ్డకట్టింది. శరీరం నల్లగా మారింది.

"నాయకా ఏమిటిది ?"

"పాము కాటేసినట్లుంది. పాము కాటుకే వళ్ళు యిలా అవుతాది."

నమ్మలేనట్లు చూశారు. "ఆశ్చర్యంగా వుంది. పాము పెదాలపైకాటు వేస్తుందా?"

"యిక్కడో జాతి మనుషులున్నారు. ఆరు చిన్నతనంనుంచి పాము యిసం తింటారు. ఆరిని పాములు కరిచినా యిసం ఎక్కదు. ఆరు మంచోళ్ళను కరిస్తే ఆళ్ళు సత్తారు" అన్నాడు. వాళ్లకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి

———